సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి లయంలో గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు , వేడుకను తిలకిస్తున్న భక్తులు

రమణీయం గోదారంగనాథుల కల్యాణం

- భక్తిపారవశ్యంతో పులకరించిన భక్తులు
- గోవిందనామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణాలు

వేములవాడ టౌన్: వేణుగోపాలస్వామి ఆలయంలో గోదారంగానాథుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, ఇల్లంతకుంట: ముస్కానిపేటలో గోదాదేవి - రంగనాథుల కల్యాణంలో పాల్గొన్న దంపతులు

వేములవాడ టౌన్, 14 : రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం గోదారంగనాథస్వామి కల్యాణం రమణీయంగా నిర్వహించారు. రాజన్న ఆలయం ఆధ్వర్యంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, అర్చకులు కల్యాణవేదికపై ఒకవైపు రంగనాథస్వామివారిని, మరోవైపు గోదాదేవి ఉత్సవమూర్తులను ఉంచారు. అనంతరం మంగళసూత్రధారణ, పూర్ణాహుతి, పూలదండల మార్పిడి, తలంబ్రాలు తదితర కార్యక్రమాల్ని నేత్రపర్వంగా నిర్వహించారు. వివిధ ఘట్టాలకు అనుగుణంగా వేదికపై వేదమంత్రాలు మార్మోగాయి. కల్యాణ ప్రాంగణమంతా గోవిందనామస్మరణతో నిండింది. ఈ సందర్భంగా భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ రాజన్న ఆలయ ఏఈవో ప్రతాప నవీన్, సూపరింటెండెంట్ అల్లి శంకర్, భక్తులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో..

సిరిసిల్లటౌన్, జనవరి 14: సిరిసిల్లలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో గోదాదేవి రంగనాథ స్వామి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. గోదాదేవి రంగనాథ స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి అభిషేకం చేసి పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని కోరుతూ స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలనాధికారి, సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

తాడూరు వేణుగోపాలస్వామి ఆలయంలో

సిరిసిల్ల రూరల్, జనవరి 14: తంగళ్లపల్లి మండలం తాడూరులోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణానిన వేద పండితులు ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు, గ్రామస్తులు ఉన్నారు.

ముస్కానిపేటలో

ఇల్లంతకుంట, జనవరి, 14 : ముస్కానిపేటలో ఆదివారం గోదాదేవి-రంగనాథుల కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు సత్యనారాయణాచార్యులు మాట్లాడుతూ ధనుర్మాసం మకర సంక్రాంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం బోగి రోజున ఈ కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవతామూర్తులను దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేయడం చేశారు. ఇక్కడ సర్పంచ్ లక్ష్మి, స్వామి, ఆలయ చైర్మన్ నర్సింహా రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: అగ్రహారం హనుమాన్ ఆలయంలో గోదారంగనాథ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సిరిసిల్ల రూరల్: తాడూరులో కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

అగ్రహారం హనుమాన్ ఆలయంలో

వేములవాడ రూరల్, జనవరి 14: అగ్రహారం హనుమాన్ ఆలయంలో ఆదివారం శ్రీగోదారంగనాథ కల్యాణం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ఈవో మారుతి పేర్కొన్నారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే సమాజ అభివృద్ధి

వేములవాడలో చెకుముకి సైన్స్ వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ, జనవరి14: సైన్స్‌తోనే సమాజ అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం వేములవాడలోని ఆయన నివాసంలో జన విజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ గోడ పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజల్లో నెలకొన్న అంధ విశ్వాసాలను నిర్మూలించాలంటే సైన్స్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ హేతుబద్ధంగా జీవించాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు రామరాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల అభిరుచి పెంచడానికి జన విజ్ఞాన వేదిక ప్రతి ఏటా చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నదన్నారు. ఈ నెల 19 నిర్వహించే పాఠశాల స్థాయి టాలెంట్ పరీక్షకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గుర్రం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సంపతి రమేశ్, ఉపాధ్యక్షుడు ప్యారం లక్ష్మీనారాయణ, కార్యదర్శి మెడపట్ల కిషన్ తదితరులు ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

నిందితుడి అరెస్టు చూపిస్తున్న సీఐ సదన్‌కుమార్, ఎస్ఐ

ముస్తాబాద్, జనవరి 14: మండల కేంద్రానికి చెందిన బిట్ల వెంకటేశ్ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేశామని సీఐ సదన్‌కుమార్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 11న వెంకటేశ్ తాళం వేసి వేరే ఊరికి వెళ్లాడు. ఆ రోజు రాత్రి ఇంటి తాళం పగుల గొట్టి ఇంట్లోకి చొరబడిని దొంగ బంగారు అభరణాలతో పాటు నగదును ఎత్తుకెళ్లాడు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు పోలీసుల సీసీ కెమరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి అతడి వద్ద నుంచి 7 తులాల బంగారు ఆభరణాలు, 12 తులాల వెండి, రూ.31 వేల నగదుతో పాటు పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఎస్ఐ శేఖర్‌రెడ్డి, సిబ్బంది చంద్రశేఖర్, రాజ్‌కుమార్, రాజశేఖర్ ఉన్నారు.

రాజన్నపేటలో ఎన్ఎస్ఎస్ శిబిరం

ఎల్లారెడ్డిపేట, జనవరి 14: రాజన్నపేటలో ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం సందర్భంగా రెండో రోజు ఆదివారం వీధులను చీపుళ్లతో శుభ్రం చేశారు. సర్పంచ్ ముక్క శంకర్, పీవో పరశురాములు ఉన్నారు.

ఆరె సంక్షేమ సంఘం కార్యవర్గం

వేములవాడ రూరల్, జనవరి 14: వేములవాడ మండలం శాభాష్‌పల్లి ఆరె సంక్షేమ సంఘం కార్యవర్గానిన ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేందర్, ఉపాధ్యక్షుడిగా కోటేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా శేఖర్, కోశాధికారిగా తిరుపతిని ఎన్నుకున్నారు. ఆరె సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రగుడులో కుక్కల స్వైర విహారం

సిరిసిల్ల రూరల్, జనవరి 14: సిరిసిల్ల మున్సిపల్ ఒకటో వార్డు పరిధిలోని రగుడులో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆదివారం కుక్కల దాడిలో వార్డుకు చెందిన బాలుడు బూర చరణ్, వంగ దేవయ్య, దానవేణి ఎల్లవ్వకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. శనివారం రాత్రి బూర కమాలకర్‌కు చెందిన గొర్రెల మందపై దాడి చేశాయి. కుక్కలతో పాటు కోతుల బెడద ఉన్నదని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

సిరిసిల్ల రూరల్, జనవరి 14: యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస సూచించారు. తంగళ్లపల్లిలో బీఆర్ఎస్ మైనార్టీ నేత ఎండీ హమీద్ నూతనంగా చికెన్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకోగా, ఆదివారం ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు. పడిగెల రాజు, ఎండీ హమీద్, సాహేదాబేగం, మైనార్టీనేతలు ఉన్నారు.

నేడు రామలింగేశ్వర కల్యాణం

ఇల్లంతకుంట, జనవరి 14 : భక్తుల కొంగు బంగారంగా కొలిచే జంగంరెడ్డిపల్లి శ్రీ రామలింగేశ్వరుడి కల్యాణోత్సవం సోమవారం ప్రారంభం కానుందని దేవాలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15 ఉదయం గణపతి పూజ, 16న మహా చండీయాగం, 17న రథ ప్రదక్షిణ, ఏకాంత సేవ, తీర్థ ప్రసాద వితరణ జరుగనున్నట్లు వెల్లడించారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్ని సౌకార్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.

తుది దశకు ఆన్‌లైన్ ప్రక్రియ

సిరిసిల్ల రూరల్, జనవరి 14: తంగళ్లపల్లి మండలంలోని 30 గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో చేపట్టిన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ తుది దశకు చేరిందని ఎంపీడీవో లచ్చాలు తెలిపారు. మండలంలోని 30 గ్రామాల నుంచి 16,825 దరఖాస్తులు వచ్చాయని ,వీటన్నింటిని మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఆన్‌లైన్ ప్రక్రియను చేపట్టమన్నారు. ఈ నెల 17లోపు పూర్తి చేస్తామన్నారు.

మిర్చికి వైరస్

కోనరావుపేట, జనవరి 14: జిల్లాలో 412 ఎకరాల మిర్చి సాగు చేసిన రైతులకు నిరాశే మిగిలింది. అంతరపంటగా సాగు చేసిన మిర్చికి రకరకాల తెగుళ్లు సోకి మొక్కల ఆకులు చిన్నవిగా మారాయి. ప్రధానంగా జెమిని వైరస్ మొక్కలకు కాత దశలో సోకడంతో రైతులు రసాయన మందులు పిచికారీ చేసినా లాభం లేకుండా పోయింది. ఇటు మిర్చి కాత సరిగా లేక, మార్కెట్‌లో ధర లేకపోవడంతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాజన్న సేవలో తరించాలి

కరీంనగర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో టీపీఆర్టీయూ జిల్లా నాయకులుఒ

వేములవాడ, జనవరి 14: రాజన్న సేవలో భక్తులు తరించేందుకు గానూ గౌడ నిత్యాన్నదాన సత్రం పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని మొదటి బైపాస్ రహదారి మహాలక్ష్మి వీధిలో గౌడ నిత్యాన్నదాన సత్రం భవన పనులను ఆదివారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. భవన నిర్మాణ పనుల కోసం ఇప్పటికే విరాళాలు సేకరించామన్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సంఘం నాయకులకు సూచించారు. భవన నిర్మాణానికి ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు గౌడ సంఘం నాయకులు మంత్రిని సత్కరించారు. ఆయన వెంట సర్పంచ్ కదిరె రాజు, ఎంపీటీసీ రంగు వెంకటేశ్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీసీ సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మ్యాడారం హరికృష్ణ ఆదివారం కరీంనగర్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగిపోయిన ఉపాధ్యాయులు, బ్లాక్ చేసిన 13 జిల్లాల స్పౌజ్ బదిలీలు జరిగేలా చూడాలన్నారు. పదోన్నతులకు టెట్ నుంచి మినహాయింపు లభించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎస్‌రద్దు చేసి, పాత పెన్షన్ వర్తింపజేయాలని, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇక్కడ టీపీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమల్ల శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు కేతిరి తిరుపతిరెడ్డి, రామ్‌రెడ్డి, జయేందర్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబురాలు



కోనరావుపేట: విజేతలకు బహుమతలను అందజేస్తున్న డెయిరీ సంఘం సభ్యులు

కోనరావుపేట, జనవరి 14: సంక్రాంతి సందర్భంగా కనగర్తిలో కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో ఆదివారం రంగవళ్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. దొడ్డ మొనికకు ప్రథమ బహుమతి అందజేశారు. డెయిరీలో అత్యధికంగా పాలు పోస్తున్న రైతులు మారుపాక రాజయ్య, పోగుల మల్లయ్య, ఎల్లా ప్రభాకర్‌రెడ్డికి ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఇక్కడ గ్రామ డెయిరీ చైర్మన్ జిల్లాల లక్ష్మారెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి ఉన్నారు.

ముగ్గుల పోటీలు

వట్టిమల్ల గొల్లపల్లి గ్రామంలో నూనె నగేశ్ యాదవ్ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు ముగ్గులు వేయగా విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.2వేలు, ద్వితీయ బహుమతిగా రూ.వెయ్యి, తృతీయ బహుమతిగా రూ.500 అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 14: సంక్రాంతి పర్వదినం సందర్భంగా రాగట్లపల్లిలో సర్పంచ్ దాసరి సుజాత ఆధ్వర్యంలో ఆదివారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి సిరికొండ రమేశ్ టీం గెలుచుకోగా రెండో బహుమతి సిరిపురం నవీన్ టీం గెలిచింది. ఇక్కడ దాసరి మహేందర్, మందాటి సతీశ్, మందాటి మల్లేశ్ ఉన్నారు.

సారంపల్లిలో ...

సిరిసిల్ల రూరల్, జనవరి 14: తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో సంక్రాంతి సందర్భంగా మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుగ్గిల్ల భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు తంగళ్లపల్లి జడ్పీటీసీ మంజుల-రాంలింగారెడ్డి నగదు బహుమతులను అందజేశారు. విజేతకు రూ.5వేలు, రన్నరప్ కు రూ.2500 అందించి అభినందించారు. కార్యక్రమంలో రాజు, ఉపసర్పంచ్ పరశురాములు, రాము, అభిషేక్, ప్రణయ్, రాజేశ్వర్‌రావు ఉన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

చందుర్తి,జనవరి 14: మూడపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన 2003-2004 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించారు. అనంతరం ఒకరికొకరు పలకరించుకుంటూ గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన పుల్కం కరుణాకర్, వట్టిమల్ల శేఖర్, నక్క సతీశ్, పుల్కం నరేందర్‌ను ఉపాధ్యాయులు, మిత్రులు అభినందించారు. ఇక్కడ ఉపాధ్యాయులు సుధాకర్, శ్రీనివాస్, నరేందర్, కవిత, కోటేశ్వర్ శర్మ, మల్లేశం, పద్మారావు, శ్రీనివాస్, అటెండర్ నాజర్ తదితరులు ఉన్నారు.

రుద్రంగిలో అయోధ్య అక్షింతల పంపిణీ

రుద్రంగిలో గ్రామస్తులకు అయోధ్య అక్షింతలను పంపిణీ చేస్తున్న నాయకులు, శ్రీరామ భక్తులు

రుద్రంగి, జనవరి 14: మండల కేంద్రంలో ఆదివారం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో ఆందించిన అయోధ్య శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ అక్షింతలను ఇంటింటికీ తిరుగుతూ శ్రీరామ భక్తులు, నాయకులు పంపిణీ చేశారు. గ్రామంలోని భక్తులు, మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి అక్షింతలను స్వీకరించారు. అయోధ్యలో ఈ నెల 22న నిర్వహించే శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం ప్రతి ఒక్కరూ ఈ అక్షింతలను ఆశీర్వచనంగా తీసుకోవాలని ట్రస్టు సభ్యులు సూచించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, అభిలాష్, గంగాధర్, రమేశ్, దాయానందం, పవన్, అశోక్‌రెడ్డి, శ్రీరామ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా ఉంటా..

నారాయణపూర్‌లో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట, జనవరి 14: ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటానని సీఎం రేవంత్‌రెడ్డి పీఆర్‌వో బొల్గం శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి పీఆర్‌వోగా నియామకమైన శ్రీనివాస్‌కు తన స్వగ్రామం నారాయణపూర్‌లో ఆదివారం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్‌లో గాడి తప్పిన తాను జర్నలిజాన్ని ఎంచుకుని అంచెలంచెలుగా ఎదిగిన తీరును వివరించారు. ఏ రంగమైనా ప్యాషన్‌గా భావిస్తే విజయం వరిస్తుందని చెప్పారు. ఇక్కడ సర్పంచ్ నిమ్మ లక్ష్మి, నలిమెల భాస్కర్, వెంకటయ్య, బుర్క గోపాల్, పాముల దేవయ్య, ఎలుసాని ప్రవీణ్, దొమ్మాట నర్సయ్య, నిమ్మ బాల్‌చందర్‌రెడ్డి, మేడి కిషన్, రమేశ్, పాముల స్వామి, బాల్‌నర్సు, అవధూత హరిప్రియ ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం

చందుర్తి, జనవరి 14: మల్యాల ప్రభుత్వ పాఠశాలలో 2022 -2023 విద్యా సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను వివేకానంద సేవా సమితి సభ్యుడు మోతుకుపల్లి మధుయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానం ఫలితాలు సాధించిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ఇక్కడ వివేకానంద సేవా సమితి సభ్యులు లోకోజు సతీశ్, సుధాకర్, మధు, మోహనాచార్యులు, గ్రామస్తులు ఉన్నారు.

మండల స్థాయి విజేత మామిడిపల్లి

కోనరావుపేట, జనవరి 14: వట్టిమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో మామిడిపల్లి జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నీలో 12 జట్లు తలపడగా మామిడిపల్లి, వట్టిమల్ల ఫైనల్‌కు చేరాయి. ఫైనల్లో ప్రథమ బహుమతిని మామిడిపల్లి, ద్వితీయ బహుమతిని వట్టిమల్ల జట్టు గెలుపొందగా ఆంజనేయులు, సర్పంచ్ కొమ్ము స్వప్న కప్‌తో పాటు నగదు అందజేశారు. ఇక్కడ ఆలయ చైర్మన్ గుండ వేంకటేశ్, టోర్నీ నిర్వాహకులు నూనె గణేశ్, గంగారాం సంపత్, యూత్ సభ్యులు లక్కం విజయ్, వంశీకృష్ణ, నరేశ్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.